BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 30 అక్టోబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 5

## రాఫెల్‌లో రాష్ట్రపతి గగనయానం

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**



భారతదేశ ప్రథమ పౌరురాలు, త్రివిధ దళాల సుప్రీం కమాండర్ ద్రౌపదీ ముర్ము రాఫెల్ యుద్ధ విమానంలో ప్రయాణించారు. హర్యానాలోని అంబాలా వైమానిక స్థావరం నుంచి ఆమె రాఫెల్‌లో గగనయానం చేశారు. ఈ రాఫెల్ యుద్ధ విమానాన్ని 17వ స్క్వాడ్రన్ కమాండింగ్ ఆఫీసర్ గ్రూప్ కెప్టెన్ అమిత్ గెహానీ నడిపారు. ద్రౌపది ముర్ము సహ పైలెట్‌గా పాల్గొన్నారు. వాయుసేన చీఫ్ మార్షల్ ఎ.పి సింగ్.. ఆమెకు తోడుగా మరో విమానంలో ప్రయాణించారు. రాఫెల్ విమానంలో ప్రయాణించిన మొదటి భారత రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము ఘనతను సాధించారు. అంతేకాదు.. ఆమె గతంలో సుఖోయ్–30 ఎంకేఐ యుద్ధ విమానంలోనూ విహరించారు. ఈ ప్రయాణం చేసిన

మిగితా 2వ పేజీలో

# తెలంగాణపై తుఫాను బీభత్సం

- రాష్ట్రాన్ని వణికించిన 'మొంథా' తుపాన్
- తెగిన చెరువులు, జలమయమైన రహదారులు
- మునిగిన వరంగల్ రైల్వే స్టేషన్
- పలు జిల్లాల్లో రెడ్ అలర్ట్
- విద్యాసంస్థలకు నేడు సెలవు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తీవ్ర తుపాను ప్రభావంతో తెలంగాణ రాష్ట్రం వర్షాల వలయంలో చిక్కుకుంది. మంగళవారం అర్ధరాత్రి సమయంలో మొంథా తుపాను కాకినాడ సమీపంలోని నరసాపురం తీరాన్ని దాటిందని వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం ఈ తుపాను బలహీనపడి తీవ్ర వాయుగుండంగా మారే దశలో ఉందని తెలిపింది. భద్రాచలానికి ఆగ్నేయంగా 50 కిలోమీటర్లు, ఖమ్మంకు 110 కిలోమీటర్ల దూరంలో తుపాను కేంద్రీకృతమై ఉందని పేర్కొంది. రానున్న గంటల్లో ఇది వాయుగుండంగా బలహీనపడుతుందని వాతావరణ కేంద్రం అంచనా వేసింది.

### రెండు రోజులపాటు భారీ వర్షాలు

తెలంగాణలో రానున్న రెండు రోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బుధవారం రోజున వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్ జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రెడ్ అలెర్ట్ జారీ చేసింది. జగిత్యాల, ఆదిలాబాద్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, సూర్యాపేట, సిద్దిపేట, జనగాం, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో కూడా భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది.

### ఆరెంజ్, ఎల్లో అలెర్టు జారీ

నిజామాబాద్, ఆసిఫాబాద్, కొత్తగూడెం, ములుగు, ఖమ్మం, నల్గొండ, మెదక్, కామారెడ్డి, రంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. గురువారం నాటికి ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కూడా వర్షాలు కొనసాగే అవకాశం ఉందని తెలిపింది.

### వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి

మొంథా ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వాగులు, వంకలు ఉప్పొంగి, రోడ్లపై నీరు నిలిచిపోయింది. వరంగల్ జిల్లాలో రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. పర్వతగిరిలో ఒక్కరోజే 34.8 సెంటీమీటర్ల వర్షం కురిసిందని వాతావరణ శాఖ తెలిపింది.

### రైతులు ఆందోళనలో

ధాన్యం కోయి మార్కెట్ యార్డులకు తరలించిన రైతులు భారీ వర్షాలతో పంట తడిసి ముద్దవుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఇంకా పొలాల్లో ఉన్న పంటలు కూడా తడవచ్చన్న భయంతో రైతులు ఆందోళనలో ఉన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా బుధవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఖమ్మం నగరంలోని రాపర్తినగర్ ప్రాంతంలో వర్షపు నీరు రోడ్డుపై చేరింది. రఘునాథపాలెం మండలం పాపటపల్లి నుండి వీఆర్ బంజార మార్గంలోని బుగ్గవాగు వరద నీరు ప్రవహిస్తుండటంలో వాహనాల రాకపోకలు నిలిపివేశారు. చింతకాని మండలం నాగులవంచ – పాతర్లపాడు మార్గంలో వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిపివేశారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యాసంస్థలకు గురువారం సెలవు ప్రకటించారు. కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ అన్ని గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వైరా రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 18.3 అడుగులు కాగా.. 19.5 అడుగులకు చేరింది. ఖమ్మం వద్ద మున్నేరు వాగు 18 అడుగులకు చేరింది. ఏన్కూరు నుంచి పల్లిపాడు వైపు వెళ్లేందుకు ఓ డీసీఎం వ్యాన్ వంతెనపై వస్తుండగా వరద ఉధృతికి వాగులోకి కొట్టుకుపోయింది. డ్రైవర్ గల్లంతయ్యాడు. డ్రైవర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు.

'మొంథా' తుపాను ఉమ్మడి వరంగల్ జిల్లాపై తీవ్ర ప్రభావం చూపింది. రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాతావరణ శాఖ మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో రెడ్ అలెర్ట్ ప్రకటించింది. జనగామ, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. మహబూబాబాద్ జిల్లాలో డోర్నకల్ జంక్షన్‌లో పట్టాలపైకి వరద నీరు చేరడంతో గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను ఉదయం నిలిపివేశారు. మమబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో కృష్ణా ఎక్స్‌ప్రెస్, తాడ్లపూసపల్లిలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లు నిలిచిపోయాయి. పలువురు ప్రయాణికులను డోర్నకల్ నుంచి బస్సుల్లో వరంగల్, ఖమ్మంకు తరలించారు. డోర్నకల్, మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లలో పట్టాలపైకి చేరిన వరద నీటిని జేసీబీల సహాయంతో ఆకేరు వాగుకు మళ్లించారు.

దీంతో డోర్నకల్‌లో నిలిచిపోయిన గోల్కొండ ఎక్స్‌ప్రెస్, మహబూబాబాద్ గుండ్రాతిమడుగులో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లను మధ్యాహ్నం తరువాత పునరుద్ధరించారు. వరంగల్ రైల్వే స్టేషన్‌ను వరద ముంచెత్తింది. వరంగల్, హన్మకొండ, కాజీపేట నగరాల్లో భారీ వరదతో నగరవాసులు సతమతమవుతున్నారు. హన్మకొండ బస్టాండ్ వరద నీటిలో మునిగింది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ముసురుతో కూడిన వర్షం పడుతుండటంతో జనం ఇండ్లు వదిలి బయటకెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వరంగల్ జిల్లాలో అతిభారీ వర్షాలు కురుస్తుండగా.. దాన్ని ఆనుకుని ఉన్న కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో బుధవారం సాయంత్రం 7గంటలవరకు 21.15సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. శ్రీపాద ఎల్లంపల్లి, మధ్యమానేరు, లోయర్‌మానేరు జలాశయాల గేట్ల అధికారులు ఎత్తి దిగువకు నీరు వదులుతున్నారు. ఎగువనున్న ఎస్సారెస్పీ డ్యామ్‌లోకి పెద్దఎత్తున వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు 20గేట్లు ఎత్తి గోదావరిలోకి వదులుతున్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు 62గేట్లకుగాను 13 గేట్లు ఎత్తి లక్షా 5వేల క్యూసెక్కుల వరదను దిగువకు వదులుతున్నారు. మధ్యమానేరు జలాశయం 5గేట్లు ఎత్తి దిగువకు 10వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు కురిసిన వర్షం రైతులకు భారీ నష్టాన్ని చేకూర్చింది. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం తడిసి ముద్దయింది. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి, మెంట్రాజ్‌పల్లి, ఇందల్‌వాయి సహకార సొసైటీ పరిధిలోని ఆయా గ్రామాల్లో ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది. ఇందల్‌వాయి సహకార సొసైటీ పరిధిలోని గిరిజన తండాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వర్షంతో వడ్లు తడిసి కొట్టుకుపోయినట్లు గిరిజనులు వాపోయారు. ఎడపల్లి మండలంలో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. లింగంపేట్ మండలంలో కల్లాల్లోని ధాన్యం తడిసింది. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలో వరి, పత్తి పైర్లు నేలకొరిగాయి.

### హైదరాబాద్‌పై మొంథా తుఫాన్ ఎఫెక్ట్

మొంథా తుఫాన్ నేపథ్యంలో నగరం, నగర శివారుప్రాంతాలల్లో బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దాంతో నగరం అతలాకుతలమైంది. జీహెచ్ఎంసీ పరిధితోపాటు నార్సింగ్, మంచిరేవుల ప్రాంతాల్లో భారీవర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మంచిరేవుల కల్వర్టుపై నుంచి వరద నీరు పారుతుండడంతో రాకపోకలను మూసేశారు. నగరంలోని పలు ప్రాంతాలలోని రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. మ్యాన్‌హెూల్స్ పొంగిపొర్లుతున్నాయి. పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మాసబ్ ట్యాంకు నుంచి లక్డికపూల్ వైపు రహదారిలో మెహదీ ఫంక్షన్ హాల్ వద్ద వర్షపు నీరు నిలవడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.

భారత్ జపాన్

## వ్యూహాత్మక బంధం బలోపేతానికి కృషి

- ప్రధాని మోడీ



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

భారత్–జపాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య, రక్షణ రంగ సహకారాన్ని విస్తరించేందుకు దృష్టి సారిస్తామని తెలిపారు. భారత్%–%జపాన్ సంబంధాలు ప్రపంచ శాంతి, స్థిరత్వం, సమృద్ధికి కీలకమని పేర్కొంటూ, జపాన్ తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన సనాయె తకాయిచికి అభినందనలు తెలిపారు.

'జపాన్ ప్రధానమంత్రి సనాయె తకాయిచితో ఆత్మీయ సంభాషణ జరిగింది. ప్రపంచ శాంతి, స్థిరత్వం కోసం ఇరుదేశాల సంబంధాలు ఎంతో ప్రాధాన్యమున్నాయని అంగీకరించాం,' అని మోదీ ఎక్స్ (పూర్వ ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. తన సమాధానంగా జపాన్ ప్రధాని సనాయె తకాయిచి కూడా ఎక్స్ వేదికగా స్పందించారు.

"భారత్–జపాన్ ప్రత్యేక వ్యూహాత్మక, గ్లోబల్ భాగస్వామ్యాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు కలిసి పనిచేస్తాం," అని ఆమె పేర్కొన్నారు. అదే సమయంలో యునైటెడ్ స్టేట్స్‌తో ఉన్న కూటమి జపాన్ భద్రతా విధానాలకు మూలస్తంభమని కూడా తకాయిచి అన్నారు.

పార్టీలో అంతర్గత విభేదాల కారణంగా మాజీ ప్రధాని షిగెరు ఇషిబా రాజీనామా చేయడంతో, లిబరల్ డెమోక్రటిక్ పార్టీకి చెందిన సనాయె తకాయిచి (64) జపాన్ తొలి మహిళా ప్రధానిగా ఎన్నికయ్యారు. తకాయిచి బ్రిటన్ మాజీ ప్రధాని మార్గరెట్ థాచర్‌కు వీరాభిమాని, ఆమెను ఆదర్శంగా తీసుకున్న 'ఐరన్ లేడీ 2.0'గా పేరు తెచ్చుకున్నారు. ఇది ఆమె ప్రధానిగా కావడానికి చేసిన మూడో ప్రయత్నం. గడచిన ఐదేళ్లలో జపాన్‌కు నాలుగో ప్రధాని కావడం గమనార్హం. మాజీ ప్రధాని షింజో అబెకు ఆప్తురాలిగా ప్రసిద్ధి.

### ఆర్థిక సవాళ్లకు సిద్ధం

జపాన్ ఆర్థిక రంగం మందగమనం నుంచి బయటపడటం తకాయిచి ముందున్న అతిపెద్ద సవాలుగా మారింది. సంప్రదాయ, జాతీయవాద ధోరణికి ప్రతినిధిగా, దృఢమైన నిర్ణయాలకు ప్రసిద్ధురాలైన ఆమె, భద్రతా వ్యవస్థలో సంస్కరణలకు కట్టుబడి ఉన్నారు.

నారా నగరంలో జన్మించిన తకాయిచి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో పట్టభద్రురాలు. రాజకీయ నేపథ్యం లేని కుటుంబం నుండి వచ్చిన ఆమె 1993లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. మోటార్ సైకిళ్లపై మక్కువ, హెవీ మెటల్ సంగీతంపై ఆసక్తితో భిన్నమైన వ్యక్తిత్వం కలిగిన ఆమె, పబ్లిక్ సర్వీస్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు

## మోడీని తండ్రిలా భావిస్తాను



- భారత్‌తో త్వరలో వాణిజ్య ఒప్పందం
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

భారత ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రశంసల వర్షం కురిపించారు. "మోదీ గారు ఓ తండ్రిలాంటి వ్యక్తి. ఆయన చాలా మంచి మనిషి, అదే సమయంలో అత్యంత కఠిన నాయకుడు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. దక్షిణ కొరియాలో జరుగుతున్న ఆసియా పసిఫిక్ ఎకనామిక్ కార్పొరేషన్ సదస్సు సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, భారత్‌తో అతి త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదురుతుందని వెల్లడించారు. "నాకు మోదీ పట్ల ప్రేమ, గౌరవం ఉంది. ఆయనతో నాకు అద్భుతమైన సంబంధం ఉంది. ఆయన చాలా మంచిగా కనిపిస్తారు. ఒక తండ్రిలా ఉంటారు. కానీ ఆయన చాలా కఠినమైనవారు," అని ట్రంప్ తెలిపారు. "ఒకసారి మేము యుద్ధ పరిస్థితిని ఎదుర్కొన్నాం. నేను భారత –పాక్ నాయకులతో మాట్లాడి పరిస్థితిని సర్దుబాటు చేశాను. రెండు రోజులకే ఇద్దరూ కాల్పుల విరమణకు సిద్ధమయ్యారు. అది అద్భుతమైన అనుభవం," అని ట్రంప్ గుర్తుచేశారు.

ట్రంప్ మాట్లాడుతూ, "ఇప్పటికే ఆలస్యమైన వాణిజ్య ఒప్పందంపై భారత్–అమెరికా త్వరలో సంతకం చేయబోతున్నాయి" అని చెప్పారు. గతంలో వ్యవసాయ, పాడి రంగాల్లో మార్కెట్ ప్రాప్తి, చమురు దిగుమతులు, రష్యా సంబంధాలు వంటి అంశాల కారణంగా చర్చలు నిలిచిపోయినప్పటికీ, తాజాగా అవి వేగం పుంజుకున్నాయని తెలిపారు. ప్రస్తుతం భారత్ నుంచి అమెరికాకు వెళ్లే వస్తువులపై 50 శాతం టారిఫ్ ఉండగా, కొత్త వాణిజ్య ఒప్పందం కుదిరితే 15%–%16 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని ట్రంప్ సూచించారు. ఈ ఒప్పందం రెండు దేశాల మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలకు కొత్త ఊపును తెచ్చే అవకాశం ఉంది. 2019లో పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో తాను మధ్యవర్తిత్వం వహించానని ట్రంప్ పేర్కొన్నారు. "మేం చర్చల ద్వారానే పరిస్థితిని సర్దుబాటు చేశాం," అని అన్నారు. అయితే భారత్ మాత్రం ఈ వ్యాఖ్యలను పునరావృతంగా ఖండిస్తూ, 'మూడో వ్యక్తి మధ్యవర్తిత్వం అవసరం లేదు' అని స్పష్టం చేస్తూనే ఉంది. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు తగ్గించబోతుందని కూడా ట్రంప్ పేర్కొన్నారు. "మోదీ గారు నాకు హామీ ఇచ్చారు త్వరలోనే రష్యా చమురు దిగుమతులు పూర్తిగా నిలిపేస్తారు," అని ట్రంప్ తెలిపారు.

## ఓవర్సీస్ స్కాలర్ షిప్ రూ.303 కోట్లు విడుదల చేయండి

- ఆర్థిక శాఖాధికారులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసి, మైనారిటీ విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్ షిప్ బకాయిలు రూ.303 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్ మొత్తాన్ని ఒకేసారి క్లియర్ చేయాలని ఆదేశించారు. నిరాశలో ఉన్న వేల కుటుంబాల్లో డిప్యూటీ సీఎం ఆదేశాలు ఆనందం నింపింది. ఆర్థిక స్తోమత లేకపోయినప్పటికీ విదేశాల్లో ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాలు సాధించి ఆర్థికంగా ఉన్నత స్థితికి ఎదగాలని ఆలోచనతో వేలాది మంది పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌పై విదేశాలకు వెళ్లారు. గత ప్రభుత్వ కాలం నుంచి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందకపోవడంతో విదేశాల్లో ఉన్న విద్యార్థులు, రాష్ట్రంలో ఉన్న తల్లిదండ్రులు మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. ఓవైపు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందక మరోవైపు అమెరికా, యూకే వంటి దేశంలో కొత్త కొత్త ఆంక్షలతో విద్యార్థులపై మానసిక ఒత్తిడి తీవ్రమైంది.

ఆయా దేశాల్లో గతంలో మాదిరిగా చదువుకుంటూ ఉద్యోగాలు చేసుకునే పరిస్థితి ప్రస్తుతం లేదు. అక్కడ రోజురోజుకు ఆర్థిక భారం పెరిగిపోతుంది. మరోవైపు బ్యాంకుల్లో తీసుకున్న ఎడ్యుకేషన్ లోన్ భారం పెరుగుతుంది. ఈ పరిస్థితిలన్నిటిని అవగాహన చేసుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ సమస్యను ప్రాధాన్యత అంశంగా భావించి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ మొత్తాన్ని ఒకేసారి క్లియర్ చేయాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న సమయంలో డిప్యూటీ సీఎం ఆదేశాలతో వేలాది కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురించాయి. కష్టకాలంలో ప్రభుత్వం ప్రతి విద్యార్థికి సుమారు రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో తమ బిడ్డలు అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారనీ, తమ ఇబ్బందులు తొలగిపోతాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. కష్టకాలంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించి రాష్ట్రానికీ, దేశానికి తిరిగి అర్థవంతమైన సేవలు అందించే అవకాశం కలుగుతుందని ఆశాభావంతో ఉన్నట్టు ఓవర్సీస్ విద్యార్థులు తెలిపారు.

## అజహరుద్దీన్‌కు మంత్రి పదవి



- ఏఐసీసీ ఆమోదం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర మంత్రివర్గంలో మైనార్టీలకు ప్రాతినిధ్యం కల్పిం చాలనే నిర్ణయానికి ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హైదరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నేత, ప్రముఖ క్రికెటర్ అజహరుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకుం టున్నట్టు వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆయన్ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజాహరుద్దీన్, తెలంగాణ జనసమితి అధ్యక్షులు కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే, వీరిద్దరి నియామకానికి గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదు. ఎమ్మెల్సీ నియామక ప్రక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజాహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసీసీ ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఆ నివేదిక క్లియర్ అయినా, కాకపోయి నా ఆయన మంత్రి పదవి చేపట్టవచ్చు. కాకపోతే ఆరు నెలల్లో ఎమ్మెల్సీగానో, ఎమ్మెల్యేగానో ఎన్నికై ఉండాలి. లేకపోతే ఆయన మంత్రి పదవి కోల్పోతారు. ఈ పరిస్థితులు ఎలా ఉన్నా అజహరు ద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దీంతో ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భారీగా ఉన్న మైనార్టీల ఓట్లు గంపగుత్తగా రాబట్టేందుకు వీలుగా అజహరుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెట్టాలనేది హస్తం పార్టీ వ్యూహంగా కనిపిస్తున్నది.

మిగితా 2వ పేజీలో

## రైతులకు నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోండి



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మొంథా తుపాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆరా తీశారు. వరి కోతల సమయం కావడంతో పాటు పలు చోట్ల కళ్లాల్లో ధాన్యం ఆరబోసిన నేపథ్యంలో రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి నల్గొండ జిల్లాల్లో మొంథా తుపాన్ ప్రభావం అధికంగా ఉండగా, హైదరాబాద్ సహా ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తుండడంతో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు.

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్, గుండ్రాతిమడుగు స్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోవడంతో పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు దారిమళ్లించిన నేపథ్యంలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. తుపాన్ ప్రభావం అధికంగా ఉన్న జిల్లాల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేయాలని, జిల్లా కలెక్టర్లు ఆయా బృందాలకు తగిన మార్గదర్శకత్వం వహించాలని సూచించారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండి, లోతట్టు ప్రాంతాల కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలన్నారు.

నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లకు మరియు క్షేత్రస్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలన్నారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లో లెవల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలను పూర్తిగా నిషేధించాలని, పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. తుపాన్ ప్రభావంతో వర్షపు నీరు నిలువ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించే అవకాశం ఉన్నందున నగర, పురపాలక, గ్రామ పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి గారు చెప్పారు.

వైద్యారోగ్య శాఖ తగినంత మందులు అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం, పశునష్టం చోటుచేసుకోకుండా అన్ని శాఖలు జాగ్రత్తలు వహించాలన్నారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి గారు సూచించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని ఆదేశించారు.

## ఉపఎన్నికలో బీఆర్ఎస్ గెలిస్తే ఏమైనా జరగొచ్చు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**




జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తే రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద మార్పులు సంభవించే అవకాశం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. "బీఆర్ఎస్ గెలిస్తే ఏమైనా జరగొచ్చు... మూడేళ్లు వెయిట్ చేయాల్సిన అవసరం ఉండకపోవచ్చు" అని ఆయన స్పష్టం చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ మాటా డుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని, జూబ్లీహిల్స్‌లో పెద్ద ఎత్తున దొంగ ఓట్లు నమోదు చేసిందని తీవ్ర ఆరోపణలు చేశారు. "12 నుంచి 13 వేల దొంగ ఓట్లు రాయించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సోదరుడికే మూడు ఓట్లు ఉన్నాయి. ప్రజలు జాగ్రత్తగా లేకపోతే మీ ఓటు కూడా ఎవరో వేస్తారు" అని హెచ్చరించారు.

కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ బెదిరింపులకు దిగుతున్నాడనివిమర్శించారు. "కత్తి మాకు ఇవ్వండి... కాంగ్రెస్‌తో యుద్ధం చేసే బాధ్యత మాది. వాళ్లు డబ్బులు ఇస్తే తీసుకోండి కానీ ఓటు మాత్రం బీఆర్ఎస్‌కే వేయండి" అని ఓటర్లను కోరారు. మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ మంత్రులపై మండిపడిన కేటీఆర్, "మాగంటి సునీతపై కామెంట్లు చేయడానికి సిగ్గు ఉండాలి. వారి కుటుంబంలో ఎవరైనా చనిపోతే బాధ కలగదా?" అని ప్రశ్నించారు. "కాంగ్రెస్ పాలనలో కరెంట్ కూడా సరిగ్గా లేదు. జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత ఫ్రీ వాటర్ స్కీమ్ కూడా ఎత్తేస్తారు. రేవంత్ రెడ్డి స్వయంగా ఇంటర్వ్యూలో ఒప్పుకున్నాడు." "కొత్త రోడ్లు లేవు, బ్రిడ్జిలు లేవు, బిల్డింగ్లు లేవు ౦ కానీ కేసీఆర్ కట్టిన వాటిని మాత్రం ఓపెన్ చేస్తున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేస్తున్నారు. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ లేకుండా అది సాధ్యం కాదని మేము ముందే చెప్పాం" అని వ్యాఖ్యానించారు. "మున్నూరు కాపులను కేసీఆర్ ఎలా గౌరవించారో మీకు తెలుసు. రైతులకు దేశంలో ఎక్కడా లేని విధంగా మేలు చేసిన సీఎం కేసీఆర్ మాత్రమే" అని కేటీఆర్ అన్నారు.



## మేడారం జాతర ఆలయాభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కేఎస్ శ్రీనివాస రాజు
- మేడారంలోని సమ్మక్క సారలమ్మ దేవాలయ పనుల పరిశీలన

**బలగం టీవీ, ములుగు**

2026 జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతర సందర్భంగా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన, నాణ్యతతో పూర్తి చేయాలని సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కేఎస్ శ్రీనివాసరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని సమ్మక్క–సారలమ్మ వనదేవతలను జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ మోహన్ నాయక్‌తో కలిసి ఆయన దర్శించుకున్నారు. అనంతరం అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేయనున్న ప్రాంగణం పనులు, పలుచోట్ల చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నా యని సంతృప్తి వ్యక్తం చేశారు. గుత్తేదారులు చేపట్టిన ఆయా పనులను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యత లోపించకుండా జాగ్రత్త పడాలని, సమ యానికి అన్ని పనులను పూర్తి చేయాలని సూచించారు. మేడారం వన దేవతలను దర్శించుకోవడానికి వస్తున్న భక్తు లకు ఎలాంటి ఆటంకం కలగ కుండా పనులు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం చేస్తున్న పనులు శాశ్వ తంగా నిలిచిపోయేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, ఆర్‌అండ్‌బీ, పీఆర్, ఎలక్ట్రిసిటీ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్, ఎండోమెంట్ అధికారులు, పూజారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బస్ ఆపరేటర్ల సంఘంతో రవాణా కమిషనర్ కీలక భేటీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రయాణికుల భద్రతను పెంపొందించేందుకు ప్రయివేట్ బస్సు ఆపరేటర్ల సంఘం ప్రతినిధులతో రవాణాశాఖ కమిషనర్ రఘునందన్ రావు భేటీ అయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి.రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన ఘోర బస్సు ప్రమాదాల నేపథ్యంలో భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా తీసుకుంటున్న చర్యలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడరాదని, బస్సుల ఫిట్‌నెస్‌తో పాటు అన్ని భద్రతా ప్రమాణాలను విధిగా పాటించాలని ఆపరేటర్లకు కమిషనర్ సూచించారు. బస్సుల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు నివారించేందుకు, ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు అత్యవసర ఏర్పాట్లు తప్పనిసరి అని చెప్పారు. ఈ సమావేశానికి హాజరైన ప్రయివేట్ బస్సు ఆపరేటర్ల సంఘం, రవాణాశాఖ సూచనలను స్వాగతిం చింది. ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తామనీ, తమ బస్సుల్లో ఆధునాతన అగ్ని ప్రమాద గుర్తింపు, నివారణ వ్యవస్థలను స్వచ్ఛందంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంతేకాకుండా బస్సు బయలుదేరే ముందు ప్రయాణికులందరికీ భద్రతా సూచనలు, జాగ్రత్తల గురించి తెలియజేస్తామని ఆపరేటర్ల సంఘం ప్రతినిధులు చెప్పారు. అత్యవసర ద్వారాలను ఎలా ఉపయోగించుకోవాలి, అగ్నిమాపక

మిగితా 2వ పేజీలో

# సామాజిక తెలంగాణ కోసమే నా పోరాటం..

- **తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

**బలగం టీవీ, మహబూబ్ నగర్:**




సామాజిక తెలంగాణ ద్వారానే ప్రజల ఆత్మగౌరవం, సమాన అవకాశాలు సాధ్యమవుతాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. మహబూబ్‌నగర్‌లో జరిగిన జాగృతి జనం బాట కార్యక్రమంలో ఆమె మీడియాతో మాట్లాడారు."కొత్తగా వచ్చిన వారిపై ఆరోపణలు, అనుమానాలు ఉండవచ్చు. కానీ నా నడక, నా పనితీరు ద్వారా ప్రజలు నా స్టాండ్ అర్థం చేసుకుంటారు. నేను ఒక పని చేపట్టితే దానిపై నా కమిట్‌మెంట్ ఎలా ఉంటుందో త్వరలోనే తెలుస్తుంది" అని అన్నారు.

నీళ్లు, నిధులు, నియామకాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్యాయం చేస్తున్నారని కవిత తీవ్రంగా విమర్శించారు. "పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి చేస్తే ఆయనకు మంచి పేరు వస్తుంది. కానీ రాజకీయ కారణాలతో ప్రజలకు ఇబ్బంది పెడుతున్నారు" అని ఆమె అన్నారు.గ్రూప్-1 నియామకాల్లో నాన్-లోకల్స్‌కు ఉద్యోగాలు ఇచ్చారని, దీనిపై సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌కి లేఖ రాసినట్లు తెలిపారు. "రెండున్నర లక్షల కోట్లు అప్పు తెచ్చి కూడా ఆరు హామీలు అమలు చేయలేకపోతున్నారు. తెచ్చిన డబ్బులు మిస్‌యూజ్ అయ్యాయి" అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీతో తనకు ఎలాంటి సంబంధం లేదని కవిత స్పష్టం చేశారు. "నా రాజీనామా యాక్సెప్ట్ చేయమని అడుగుతూనే ఉన్నా. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని పట్టించుకోవడం లేదు. బీఆర్ఎస్ పేరుతో నన్ను అడగకండి" అని అన్నారు."భౌగోళిక తెలంగాణను సాధించాం కానీ సామాజిక తెలంగాణ సాధించాల్సి ఉంది. విద్య, వైద్య రంగాల్లో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించక పేద విద్యార్థులు చదువు ఆపుతున్నారు. ప్రభుత్వం దీనిపై స్పందించాలి" అని అన్నారు.

"ప్రస్తుత కేబినెట్‌లో ముస్లింలు, లంబాడీలు లేరు. బీసీలకు తగిన ప్రాతినిధ్యం లేదు. బీసీలకు 42 శాతం వాటా రావాలి. అగ్రవర్ణాల్లోనూ వైశ్యుల వంటి వర్గాలకు అవకాశాలు రావాలి" అని ఆమె డిమాండ్ చేశారు."ఎంబీసీల అభివృద్ధి కోసం ప్రత్యేక శాఖ ఏర్పాటు చేశాం. ప్రతి సామాజిక వర్గంలోనూ నాయకత్వం రావాలి. మహిళల కోసం 'లీడర్' కార్యక్రమం చేపట్టాం. జాగృతి సంస్థ ఇకపై ప్రజల సమస్యల పరిష్కారంపై మరింత దృష్టి సారిస్తుంది" అని తెలిపారు.

జాగృతి తరపున షాడో కేబినెట్ ఏర్పాటు చేయనున్నట్లు కవిత వెల్లడించారు. "ప్రజలకు చేయాల్సిన పనులను చేయించే వరకు ప్రభుత్వాన్ని నీడలా వెంటాడతాం" అని అన్నారు "రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమంలో లేరు. అందుకే ఆయనకు తెలంగాణ తల్లి ప్రాధాన్యం తెలియదు. గెజిట్ లేదన్న కారణంతో ఆమెను మార్చడం తప్పు" అని కవిత అన్నారు. "ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు, ఆత్మగౌరవం కలగాలంటే సామాజిక తెలంగాణ తప్ప వేరే దారి లేదు. అదే నా ప్రయాణం, అదే జాగృతి లక్ష్యం" అని కవిత స్పష్టం చేశారు.

# రాఫెల్‌లో రాష్ట్రపతి గగనయానం

(మొదటి పేజీ తరువాయి)

రెండో మహిళ రాష్ట్రపతిగా కూడా ఆమె గుర్తింపు పొందారు. అలాగే రెండు యుద్ధ విమానాల్లో గగనయానం చేసిన రాష్ట్రపతిగా కూడా నిలిచారు. గతంలో నాటి రాష్ట్రపతులు అబ్దుల్ కలాం 2006లో, ప్రతిభా పాటిల్ 2009లో సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధవిమానాల్లో ప్రయాణించిన విషయం విదితమే.

రాష్ట్రపతికి సాంప్రదాయ గార్డ్ ఆఫ్ ఆనర్‌తో స్వాగతం లభించింది. రాఫెల్ సామర్థ్యాలపై ఆమెకు అధికారులు వివరించారు. బుధవారం ఉదయం 11.27 గంటలకు విమానం టేకాఫ్ అయింది. సుమారు 30 నిమిషాల పాటు కొనసాగి దాదాపు 200 కిలోమీటర్లు ప్రయాణిచింది. ఈ సమయంలో రాఫెల్ విమానం 15వేల అడుగు ఎత్తులో, గంటకు 700 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించింది. ఇక రాఫెల్‌లో ఎక్కడానికి ముందు రాష్ట్రపతి ముర్ము.. జీ-సూట్‌ను ధరించారు. సన్‌గ్లాసెస్ పెట్టుకున్నారు. హెల్మెట్ పట్టుకొని పైలట్‌తో కలిసి ఫొటోలు దిగారు. వీటికి సంబంధించిన ఫొటోలనూ, తన అనుభవాన్ని ద్రౌపది ముర్ము సామాజిక మాధ్యమాలు వేదికగా పంచుకున్నారు.ఫ్రాన్స్ కంపెనీ డసాల్ట్ ఏవియేషన్ తయారు చేసిన రాఫెల్ యుద్ధ విమానాలు.. 2020 సెప్టెంబర్‌లో భారత వైమానిక దళంలో చేరాయి. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్‌పై భారత సైన్యం రాఫెల్ యుద్ధ విమానాలను ప్రయోగించిన విషయం విదితమే. ఇప్పుడు ఆ యుద్ధ విమానాల్లోనే భారత రాష్ట్రపతి ప్రయాణించడం గమనార్హం.

# బస్ ఆపరేటర్ల సంఘంతో రవాణా కమిషనర్ కీలక భేటీ

(మొదటి పేజీ తరువాయి)

పరికరాలను ఎలా వాడాలి వంటి అంశాలపై ప్రయాణికులకు అవగాహన కల్పిస్తామని వారు చెప్పారు. ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యలు, బస్సు ఆపరేటర్ల స్వచ్ఛంద భాగస్వామ్యంతో ప్రయివేటు బస్సు ప్రయాణాలు మరింత సురక్షితంగా మారతాయని సంబంధిత అధికారులు విశ్వసిస్తున్నారు. ఇదిలావుంటే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గడిచిన 5 రోజుల తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన 209 బస్సులపై కేసులు నమోదు చేసి 9 బస్సులను సీజ్ చేసినట్టు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి.రమేష్ తెలిపారు. ఈ తనిఖీల సందర్భంగా చాలా బస్సుల్లో కనీస అగ్నిమాపక పరికరాలు, ఎమర్జెన్సీ డోర్లు లేకపోవడంతో పాటు సరైన ఫైర్ అలారం, రక్షణ వ్యవస్థలు లేని బస్సులను అధికారులు గుర్తించారు. కమర్షియల్ గూడ్స్ రవాణా చేయడం, యూనిఫాం ధరించకపోవడం, అనుమతి లేకుండా సీట్లను మార్పు చేసిన బస్సులతో పాటు ఇతర ఉల్లంఘనలపైన కేసులను నమోదు చేశారు. ఈ 5 రోజుల్లో రూ.4.94లక్షలు జరిమానాలు విధించారు. బుధవారం చేపట్టిన తనిఖీల్లో 17 కేసులు నమోదు చేసి, ఒక బస్సును స్వాధీనం చేసుకొని రూ.39వేలు పెనాల్టీలు విధించినట్టు జేటీసీ తెలిపారు. రానున్న రోజుల్లో గ్రేటర్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రయివేట్ బస్సులపై తనిఖీలను ముమ్మరం చేసి, భద్రతా నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అజహరుద్దీన్‌కు మంత్రి పదవి

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి వర్గ విస్తరణపై కొన్ని రోజులుగా ఏఐసీసీ కసరత్తు చేసింది. ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అజహరుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతం మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించినట్టుగా తెలిసింది. మరో రెండు మంత్రిపదవులు ఎప్పుడు భర్తీ చేస్తారనే విషయంలో స్పష్టత లేదు. అజహరుద్దీన్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయినా తాజాగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆయన సిద్ధపడ్డారు. అయితే, ఆయనకు కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నిర్ణయించింది. ప్రస్తుత రాష్ట్ర మంత్రివర్గంలో 15 మంది ఉండగా.. మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశముంది. అందులో మొదటిసారి ముఖ్యమంత్రితోపాటు 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో ముగ్గురు మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రస్తుతం మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశం ఉండటంతో ఆ పార్టీ అధిష్టానం ముస్లిం మైనార్టీకి అవకాశం కల్పించింది. ఒక వేళ గవర్నర్ కోటాలో అజాహరుద్దీన్‌కు అవకాశం దక్కకపోతే త్వరలో ఖాళీ కానున్న ఎమ్మెల్సీ స్థానంలో ఒకటి ఆయనకు కేటాయిస్తున్నారని తెలిసింది. ఇంకా మిగిలి ఉన్న రెండు మంత్రి పదవులు ఏయే సామాజిక వర్గానికి ఇవ్వాలనే దానిపై కసరత్తు కొనసాగుతున్నట్టు తెలుస్తుంది.

తనను మంత్రివర్గంలోకి తీసుకుంటున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అజహరుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన్ను ఈమేరకు మర్యాదపూర్వకంగా కలిశారు.



# సీఎం రేవంత్ రెడ్డిపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఫిర్యాదు

**బలగం టీవీ, హైదరాబాద్:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సీ. సుదర్శన్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. సినీ కార్మికుల సభలో రేవంత్ రెడ్డి హామీలు ఇచ్చి ఎన్నికల ప్రవర్తనా నియమావళి ని ఉల్లంఘించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు సీఈఓను కలిసి చర్యలు తీసుకోవాలని కోరారు.

# జగిత్యాల జిల్లా వాసిపై సౌదీలో 'మత్లూబ్' కేసు..

**బలగం టీవీ, జగిత్యాల**



జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గోపులాపూర్ గ్రామానికి చెందిన గాజుల శ్రీనివాస్ కు 'ఫైనల్ ఎగ్జిట్' (దేశం వదిలి వెళ్ళడానికి అనుమతి) లభించక సౌదీ అరేబియా రాజధాని రియాద్ లో చిక్కుకుపోయిన సంఘటన జరిగింది. 12 వేల సౌదీ రియాళ్ళు (రూ.2 లక్షల 80 వేలు) దొంగతనం జరిగిందని యజమాని ఫిర్యాదు మేరకు శ్రీనివాస్ పై 'మత్లూబ్' (వాంటెడ్ బై పోలీస్) కేసు నమోదైంది. బీపీ, నరాల సమస్యతో బాధపడుతున్న శ్రీనివాస్ ను సౌదీ నుంచి ఇండియాకు వాపస్ తెప్పించాలని అతని కుమారుడు గాజుల సాయికిరణ్ మంగళవారం హైదరాబాద్ సీఎం ప్రవాసీ ప్రజావాణి' ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేరిట వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, ఎమిగ్రంట్స్ వెల్ఫేర్ ఫోరం ప్రతినిధి మహ్మద్ బషీర్ అహ్మద్ లు ఆయనకు మార్గదర్శనం చేశారు. 2017 లో ఆజాద్ వీసాపై సౌదీ వెళ్లిన గాజుల శ్రీనివాస్ గత ఎనిమిది ఏళ్లుగా అక్కడే ఉన్నాడు. భారత్ కు వాపస్ వెళ్ళడానికి అడ్డంకిగా ఉన్న 'మత్లూబ్' కేసు తొలగించేందుకు సహకరించాలని అతను రియాద్ లోని ఇండియన్ ఎంబసీకి ఇదివరకే రెండుసార్లు విజ్ఞప్తి చేశాడు.

**'హురూబ్'.. 'మత్లూబ్'**

సౌదీ అరేబియాలో 'కఫీల్' (స్పాన్సర్ / యజమాని) కి తెలుపకుండా ప్రవాసి ఉద్యోగి పనికి గైరుహాజరు కావడం, పారిపోవడాన్ని అరబ్బీలో 'హురూబ్' (పారిపోయిన ప్రవాసి ఉద్యోగి) అంటారు. సౌదీ చట్టాల ప్రకారం ఉద్యోగి పారిపోయిన సందర్భాలలో యజమాని 'జవజత్' (పాస్ పోర్ట్, ఇమ్మిగ్రేషన్ శాఖ) అధికారులకు ఫిర్యాదు చేస్తే ప్రవాసి ఉద్యోగిని 'హురూబ్' గా ప్రకటిస్తారు. కొందరు యజమానులు పారిపోయిన ఉద్యోగులపై దొంగతనం, ఆస్తి నష్టం లాంటి 'మత్లూబ్' (పోలీసు కేసు) నమోదు చేస్తుంటారు. దురుద్దేశం కలిగిన కొందరు 'కఫీల్లు' పారిపోయిన ఉద్యోగులను పీడించడానికి 'మత్లూబ్' వ్యవస్థను ఒక ఆయుధంగా వాడుకుంటున్నారు. ఉద్యోగులకు సరైన భోజనం, వసతి లేకపోవడం, వేతనాలు చెల్లించకపోవడం, అధిక పనిగంటలు, యజమాని సెలవు మంజూరు చేయకపోవడం, యజమాని వేధింపులు, హింసలను, అమానవీయ ప్రవర్తన తట్టుకోలేక పారిపోతుంటారు.

'మత్లూబ్' (పోలీస్ కేసు) ఉన్నవారికి ముందున్నవి రెండు మార్గాలు.. యజమాని కేసు వాపస్ తీసుకోవడం లేదా పోలీసుల ముందు లొంగిపోయి న్యాయ పోరాటం చేయడం. రియాద్ లోని ఇండియన్ ఎంబసీ, జిద్దా లోని ఇండియన్ కాన్సులేట్ కార్మికులకు న్యాయ సహాయం (లీగల్ ఎయిడ్) అందిస్తుంది. అయినా కార్మికులు న్యాయ పోరాటం చేయడం అంత సులువు కాదు.

# శ్రీ రామమందిర నిర్మాణానికి రూ.3000 కోట్లకు పైగా విరాళాలు

- **అయోధ్యలో నవంబర్ 25న భారీ ధ్వజారోహణ**
- **ప్రధాని మోదీ ముఖ్య అతిథి**

**బలగం టీవీ, అయోధ్య**



అయోధ్యలో శ్రీరామమందిర నిర్మాణం కోసం దేశవ్యాప్తంగా ప్రజలు విశేషంగా స్పందించారు. ఇప్పటి వరకు రూ.3000 కోట్లకు పైగా విరాళాలు అందాయని రామమందిర నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. ఆలయ నిర్మాణానికి మొత్తం వ్యయం సుమారు రూ.1,800 కోట్లుగా అంచనా వేశామని ఆయన వెల్లడించారు. ఇప్పటివరకు రూ.1,500 కోట్ల మేరకు బిల్లింగ్ పూర్తయిందని, నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని మిశ్రా వివరించారు. 2022లో రామమందిర నిధుల సేకరణ కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి దేశవ్యాప్తంగా ప్రజలు ఉదారంగా విరాళాలు అందించారని తెలిపారు. అయోధ్యలో నవంబర్ 25న భారీ ఎత్తున ధ్వజారోహణ కార్యక్రమం జరగనుందని, ఆ కార్యక్రమానికి దాతలందరినీ ఆహ్వానిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ వేడుకకు ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు.

ధ్వజారోహణ సందర్భంగా ఆలయ శిఖరంపై జెండాను ఎగురవేస్తారని, ఈ కార్యక్రమానికి కనీసం 8 వేల మందికి ఆహ్వానాలు పంపనున్నట్లు తెలిపారు. మొత్తం 70 ఎకరాల్లో నిర్మిస్తున్న ఆలయ సముదాయంలో శేషావతార్ ఆలయం, కుబేర్ తిల, సప్త మండపాలను ప్రధాని మోదీ సందర్శించే అవకాశం ఉందని మిశ్రా వివరించారు. గత జనవరి 22న బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ ప్రధాని మోదీ సమక్షంలో జరిగిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ప్రధాన ఆలయంలో ఒకేసారి 5 నుంచి 8 వేల మంది భక్తులు దర్శనం చేసుకునే సౌకర్యం కల్పించబడిందని తెలిపారు. దక్షిణ దర్శన మార్గం ద్వారా రామాలయ దర్శనానికి 20 నిమిషాలు, సుగ్రీవ్ కిలా వరకు పూర్తి ప్రదక్షిణ చేయాలంటే 40 నిమిషాలు పడుతుందని మిశ్రా తెలిపారు.

# కేంద్ర పథకాల నిధులను దారి మళ్లించవద్దు..

- పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు
- మంజూరైన పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి, దిశ కమిటీ చైర్మన్ బండి సంజయ్ కుమార్




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

పార్టీలకు అతీతంగా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని,కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులను ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు మళ్లించవద్దని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి, జిల్లా అభివృద్ధి, కోఆర్డినేషన్ మానిటరింగ్ కమిటీ (దిశ) చైర్మన్ బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అభివృద్ధి, కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (దిశ)సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో కమిటీ చైర్మన్, కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధికి ఎన్నో నిధులు మంజూరు చేయించి పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఏ పార్టీకి చెందిన వారైనా నియోజకవర్గ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వవచ్చని, రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులే కారణమని,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. 851 కోట్ల రూపాయల ఎంపీ నిధులను కరీంనగర్ అభివృద్ధికి కేటాయించామని అన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో ఆధునిక సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో హుజురాబాద్ హుస్నాబాద్ జమ్మికుంట సిరిసిల్ల ఆసుపత్రులకు అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయిస్తున్నామని, అందుకు తగిన విధంగా సిబ్బందిని వైద్యులను నియమించాలనిఅన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు 15వేల సైకిళ్లు ఉచితంగా అందజేశామని మరో 5 వేల సైకిల్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని,ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ తగ్గాయని అన్నారు.

పీఎం శ్రీ నిధులను ఇతర కార్యక్రమాలకు మళ్ళిస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులను హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్స్, మౌలిక సదుపాయాలు అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని,ఎంపీ నిధుల ద్వారా మంజూరైన పనులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అన్నారు. గన్నేరువరం బ్రిడ్జి, కేంద్రం సేతు బంధన్ పథకం ద్వారా మంజూరు చేసిన కరీంనగర్ ఆర్ఓబి నిర్మాణం తదితర పనులన్నీ వేగవంతం చేయాలని ఆదేశించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని మందులు అందుబాటులో ఉంచాలని,రానున్న నాలుగు సంవత్సరాల కాలానికి సరిపడా మందుల ఇండెంట్ తనకు సమర్పించాలని, నిధులు సమకూరుస్తానని అన్నారు . ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తి చేయాలని,కరీంనగర్ సిరిసిల్ల జిల్లాలోని అంగన్వాడీ టీచర్లకు రోజువారి నివేదికల సమర్పించేందుకు ఉచితంగా ట్యాబ్ అందజేస్తామనిఅన్నారు. సోలార్ పవర్ వినియోగం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలను గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు.

ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య మాట్లాడుతూ పాఠశాలల్లో మరుగుదొడ్లు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. తన క్షేత్రస్థాయి పర్యటనలో అనేక పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవని అన్నారు.కస్తూరిబా పాఠశాలల్లో సిబ్బంది వేతనాలు పెంచాలని, మోడల్ స్కూల్ సిబ్బందికి ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని,మధ్యలో చదువు ఆపేసిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారిని తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. విద్య, వైద్యం తదితర రంగాల్లో కేంద్రం అనేక నిధులు వెచ్చించి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. ప్రజలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకునేలా వారికి గ్రామస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారుల్లో ఉందని అన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సిరిసిల్ల ఇన్చార్జి కలెక్టర్ గరీమా అగర్వాల్, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ టవర్ సర్కిల్ వద్ద భారీ అగ్నిప్రమాదం



- షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి నాలుగు షాపులు దగ్ధం

**బలగం టీవీ, కరీంనగర్**

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని టవర్ సర్కిల్ వద్ద బుధవారం ఉదయం పెద్ద ఎత్తున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం ప్రకారం, కపిల డ్రెస్సెస్ షోరూమ్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు పక్కనున్న దుకాణాలకు వ్యాపించాయి. ఈ అగ్నికీలల్లో బట్టల దుకాణంతో పాటు వినాయక ఎంటర్‌ప్రైజెస్, ఫోటోగ్రఫీ షాప్, కెనాన్ ఫోటోగ్రఫీ దుకాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఆ సమయంలో దుకాణాలు మూసివేసి ఉండటంతో పెద్ద ప్రాణనష్టం తప్పింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని రెండు గంటలపాటు తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో కపిల దుకాణం యాజమాన్యానికి భారీగా ఆస్తినష్టం సంభవించినట్లు అంచనా.

# నిండుకుండగా లోయర్ మానేరు జలాశయం

- ఎగువ వర్షాలతో మోయతుమ్మెద వాగు, మిడ్ మానేరు నుండి వరద రెండు గేట్లు ఎత్తి నీరు విడుదల


**బలగం టీవీ, కరీంనగర్**

కరీంనగర్ నగర పరిధిలోని లోయర్ మానేరు జలాశయం (ఎల్ఎండీ) మరోసారి నిండుకుండలా మారింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా మిడ్ మానేరు జలాశయం, మోయతుమ్మెద వాగు ద్వారా వరద ప్రవాహం ఎల్ఎండీకి చేరడంతో జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం సాధించింది. దీంతో రిజర్వాయర్ ఇంజినీర్లు బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఇన్‌ఫ్లో మరింత పెరిగితే మరికొన్ని గేట్లు ఎత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మొత్తం 24 టీఎంసీల సామర్థ్యం గల ఎల్ఎండీ రిజర్వాయర్ ప్రస్తుతం పూర్తిగా నిండిపోయినట్లు సమాచారం. అధికారులు మానేరు వాగు పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు, రైతులు, కాపరులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



# స్నేహితుల మోసం...


## అప్పు తిరిగి ఇవ్వలేదని వైద్యుడి ఆత్మహత్య



**బలగం టీవీ, కరీంనగర్**

స్నేహితులు తీసుకున్న అప్పు తిరిగి చెల్లించకపోవడం, బ్యాంకు ఈఎంఐల ఒత్తిడి తట్టుకోలేక కరీంనగర్ జిల్లాలో ఓ వైద్యుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాదకర ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. కరీంనగర్ జిల్లా నగునూరులోని ప్రతిమ వైద్య కళాశాలలో అనస్థీషియా పీజీ రెండో సంవత్సరం చదువుతున్న డాక్టర్ ఎంపటి శ్రీనివాస్ (42) బలవన్మరణానికి పాల్పడ్డారు. డాక్టర్ శ్రీనివాస్ పలువురు స్నేహితులకు భారీ మొత్తంలో అప్పు ఇచ్చారు. తన నుండి అప్పులు తీసుకున్న స్నేహితులు కరీంనగర్ ప్రాంతానికి చెందిన వింజనురి కరుణాకర్ రూ. 1.50 కోట్లు తీసుకున్నారు. కిరణ్, కవిత, వెంకట నరహరి అనే ముగ్గురు స్నేహితులు శ్రీనివాస్ పేరు మీద రూ. 1.35 కోట్ల బ్యాంకు రుణం తీసుకున్నారు. బంజేరుపల్లికి చెందిన కుమారస్వామి తన వ్యాపారం కోసం రూ. 28 లక్షలు అప్పుగా తీసుకున్నారు. స్నేహితులు తీసుకున్న అప్పులు తిరిగి చెల్లించకపోవడంతో, డాక్టర్ శ్రీనివాస్ ఆ బ్యాంకు రుణం ఈఎంఐలు చెల్లించలేకపోయారు. దీంతో బ్యాంకు అధికారులు శ్రీనివాస్‌పై ఒత్తిడి తెచ్చారు. అప్పు తీర్చమని తన స్నేహితులను అడిగితే, వారు డబ్బు ఇవ్వమని నిరాకరించి, ఏం చేసుకుంటావో చేసుకో అంటూ బెదిరించినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన డాక్టర్ శ్రీనివాస్ బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ధర్మారం మండల మాజీ చైర్మన్ పీర్ మహ్మద్ కన్నుమూత



**బలగం టీవీ, పెద్దపల్లి**

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్ విండో) మాజీ చైర్మన్ పీర్ మహ్మద్ (72) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. ఇటీవలి కాలంలో ఆయన అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. వైద్యులు ఆయనకు కిడ్నీ ఫెయిల్యూర్ అని నిర్ధారించారు. చికిత్స కొనసాగుతున్న సమయంలోనే గుండెపోటు రావడంతో ఆయన ప్రాణాలు కోల్పోయారని కుటుంబ సభ్యులు తెలిపారు.

మండలంలో పీర్ మహ్మద్ ప్రముఖ రాజకీయ నాయకుడు. 1981లో సుల్తానాబాద్ బ్లాక్ సమితి కోఆప్షన్ సభ్యుడిగా ఆయన పదవిని నిర్వర్తించారు. తొలుత కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా ఉన్న ఆయన, 1983లో ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన తరువాత ఆ పార్టీలో చేరి క్రియాశీలకంగా పనిచేశారు. టీడీపీ పాలనలో 1987లో మండల ప్రజా పరిషత్ వ్యవస్థ ఏర్పడిన సందర్భంగా ఆయన కీలక పాత్ర పోషించారు.



# బదిలీపై వెళుతున్న ఏఎస్ఐకు ఎస్సై ఘన సన్మానం

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి ఎ.ఎస్ఐగా ఆర్ మల్లేష్ విధులు నిర్వహిస్తున్నారు. తేదీ 28-10-2025 రోజున బదిలీపై బోయినిపల్లి మండల పోలీస్ స్టేషన్ నుండి కరీంనగర్ కమిషనరేట్ కు వెళుతున్న సందర్భంగా ఎ.ఎస్.ఐను ఎస్.ఐ రమాకాంత్ తన సిబ్బందితో కలిసి శాలువతో ఘనంగా సన్మానించినారు.

# తల్లి పుట్టిన తేదీతో టికెట్ కొని రూ.240 కోట్ల లాటరీ గెలిచిన తెలుగు యువకుడు..!

- లక్కీ నెంబర్‌గా అమ్మ పుట్టినరోజు..




**బలగం టీవీ, యూఏఈ**

యూఏఈలోని అబుదాబిలో నివసిస్తున్న ఓ తెలుగు యువకుడికి ఊహించని అదృష్టం తలుపు తట్టింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బోళ్ల అనిల్ కుమార్ అనే యువకుడు ఏకంగా 100 మిలియన్ దిర్హామ్స్ (భారత కరెన్సీలో సుమారు రూ.240 కోట్లు) లాటరీ గెలుచుకున్నారు. గత కొన్నేళ్లుగా యూఏఈలో ఉంటున్న అనిల్ కుమార్‌కు లాటరీ టికెట్లు కొనే అలవాటు ఉంది. ఇందులో భాగంగా కొన్న ఒక లాటరీ టికెట్‌తోనే ఈ నెల 18వ తేదీన జరిగిన లక్కీ డ్రాలో ఆయన ఈ భారీ మొత్తాన్ని గెలుచుకున్నారు. ఈ అదృష్టానికి కారణం తన తల్లి పుట్టినరోజు తేదీని ఆ టికెట్ నంబర్ చివరి అంకెలుగా ఎంచుకోవడమేనని అనిల్ కుమార్ తెలిపారు. "ఇందులో నా ప్రత్యేకత ఏమీ లేదు. అందరిలాగే లాటరీ టికెట్ కొన్నాను. అందులో చివరి నంబర్లు మా అమ్మ పుట్టిన తేదీ కావడంతోనే నాకు అదృష్టం కలిసి వచ్చింది," అని అనిల్ కుమార్ సంతోషంగా చెప్పారు. ఈ డబ్బుతో తన తల్లిదండ్రులను అబుదాబి తీసుకువచ్చి ఇక్కడే స్థిరపడతానని, ఒక లగ్జరీ కారు కొంటానని, కొంత డబ్బును ఛారిటీలకు ఇస్తానని యువకుడు ప్రకటించారు. భారతదేశంలో ఈ లాటరీ గెలిచి ఉంటే దాదాపు రూ.90 కోట్లు పన్ను చెల్లించాల్సి వచ్చేదని, అయితే యూఏఈలో లాటరీపై ఎలాంటి పన్ను లేకపోవడం మరో అదృష్టమని అనిల్ కుమార్ తెలిపారు.



# వరుణుడి ఆటంకం... భారత్ తొలి టీ20 రద్దు

- గిల్, సూర్యకుమార్ దూకుడు వృథా..

బలగం టీవీ, హైదరాబాద్

కాన్‌బెర్రాలోని మనుకా ఓవల్‌లో బుధవారం భారత్–ఆస్ట్రేలియా మధ్య తొలి టీ20 పోరు వర్షం కారణంగా రద్దయింది. వరుణుడు ఆటకు పదేపదే అడ్డంకిగా మారడంతో అంపైర్లు చివరికి మ్యాచ్‌ను రద్దు చేసినట్లు ప్రకటించారు.

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా 9.4 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 97 పరుగులు చేసింది. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ మరియు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ చెలరేగిపోతూ బౌండరీలు, సిక్సర్లతో రన్‌ల వర్షం కురిపించారు. తొలి వర్ష విరామం అనంతరం వారు మరింత దూకుడుగా ఆడి ఆసీస్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. అయితే ఇన్నింగ్స్ 9.4 ఓవర్ల వద్ద ఉన్న సమయంలో మళ్లీ భారీ వర్షం ప్రారంభమైంది. వర్షం తగ్గకపోవడంతో, మైదానం చిత్తడిగా మారింది. చివరకు నిర్వాహకులు మ్యాచ్ రద్దు ప్రకటించారు.

ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ టాస్ గెలిచి ముందుగా ఫీల్డింగ్ ఎంచుకోవడం ద్వారా, అంతర్జాతీయ టీ20ల్లో టాస్ గెలిచిన 18 మ్యాచ్‌ల్లోనూ ఫీల్డింగ్ ఎంచుకున్న ప్రత్యేక రికార్డును సొంతం చేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో శుభ్‌మాన్ గిల్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. రెండో వికెట్‌కు హాఫ్ సెంచరీ భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. ఆట ఆగిపోయే సమయానికి గిల్, సూర్యకుమార్ జోడీ 62 పరుగులు జోడించారు. అభిషేక్ శర్మ 19 పరుగుల వద్ద నాథన్ ఎల్లిస్ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. ఐదు టీ20ల సిరీస్‌లో రెండుజట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ ఈ నెల 31న మెల్బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరుగనున్నది.



# ‘కే ర్యాంప్’ నుంచి ఓనమ్ వీడియో సాంగ్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

టాలీవుడ్ యువ హీరో కిరణ్ అబ్బవరం మరోసారి తన సత్తా చాటుకున్నారు. విభిన్నమైన కథలు, రియలిస్టిక్ ఎమోషన్స్‌తో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించిన ఆయన తాజా చిత్రం ‘కే ర్యాంప్ ’ బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సాధించింది. కొత్త కాన్సెప్ట్, ఎనర్జిటిక్ ప్రెజెంటేషన్, రిచ్ టెక్నికల్ వర్క్‌తో ఈ సినిమా ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. అన్ని ఏరియాల్లో కలెక్షన్ల వర్షం కురిపిస్తూ, ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. ఈ నెల 18న విడుదలైన ‘కే ర్యాంప్’ విజయవంతంగా మొదటి వారాన్ని పూర్తి చేసుకుని రెండో వారంలోకి అడుగుపెట్టింది. తాజాగా సినిమా యూనిట్ విడుదల చేసిన ‘ఓనమ్’ ఫుల్ సాంగ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాలేజీ నేపథ్యంలో సాగే ఈ కలర్‌ఫుల్ సాంగ్‌లో కిరణ్, యుక్తి జంట డాన్స్ స్టెప్పులు, కాస్ట్యూమ్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి.

యువ దర్శకుడు జైన్స్ నాని రూపొందించిన ఈ యాక్షన్, కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్‌ల మేళవింపుగా సాగే కథలో కిరణ్ అబ్బవరం ఎనర్జిటిక్ నటనతో మెరిశాడు. హీరోయిన్ యుక్తి తారేజ్ గ్లామర్, నటనతో ఆకట్టుకుంది. సీనియర్ నటులు నరేష్, సాయికుమార్, వెన్నెల కిషోర్ ప్రెజెన్స్ సినిమాకు బలం చేకూర్చాయి. ‘కే ర్యాంప్’ కథ ఫ్యాషన్, కాంపిటీషన్, యూత్ డ్రీమ్స్ చుట్టూ తిరుగుతూ, నేటి తరం యువత ఆలోచనలకు దగ్గరగా సాగుతుంది. హాస్య మూవీస్, రుద్రాన్ష్ సెల్యూలాయిడ్స్ బ్యానర్లపై రాజేష్ దండా, బాలాజీ గుత్తా, శివాజీ బొమ్మక్ సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమా సుమారు రూ.4 కోట్ల బడ్జెట్‌తో రూపొందించబడింది. రిలీజ్‌కు ముందే మంచి బజ్ సృష్టించిన ఈ సినిమా, రూ.8 కోట్లకు పైగా థియేట్రికల్ బిజినెస్ సాధించింది. బ్రేక్ ఈవెన్ కోసం రూ.9 కోట్ల షేర్ (రూ.18 కోట్ల గ్రాస్) కావాల్సి ఉన్నా, మేకర్స్ ప్రకారం సినిమా కేవలం మూడు రోజుల్లోనే రూ.17.5 కోట్ల గ్రాస్ సాధించి బ్రేక్ ఈవెన్ చేరుకుందని ట్రేడ్ వర్గాల సమాచారం.

# మరోసారి పోలీసులను ఆశ్రయించిన మెగాస్టార్ చిరంజీవి

బలగం టీవీ, హైదరాబాద్


మెగాస్టార్ చిరంజీవి మరోసారి పోలీసులను ఆశ్రయించారు. తనపై సోషల్ మీడియా వేదిక ఎక్స్ (ట్విటర్)లో అభ్యంతరకర పోస్టులు పెడుతున్నారంటూ దయా చౌదరి అనే వ్యక్తిపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ఇప్పటికే తాను దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పు ఇచ్చినప్పటికీ, కొందరు వ్యక్తులు ఇంకా తన పేరు, ఫోటోలు, వాయిస్ వాడుతూ పోస్టులు చేస్తున్నారని పేర్కొన్నారు. వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సైబర్ క్రైమ్ అధికారులు ఈ ఫిర్యాదును నమోదు చేసి విచారణ ప్రారంభించారు.ఇప్పటికే కొద్ది రోజుల క్రితం డీప్ ఫేక్ వీడియోలు, మార్ఫింగ్ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చిరంజీవి ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. కొందరు ఎఐ టెక్నాలజీ సాయంతో ఆయన ఫోటోలను అశ్లీల కంటెంట్‌గా మారుస్తూ, వెబ్‌సైట్లలో పోస్టు చేసినట్టు గుర్తించారు.

# వన్డే ర్యాంకింగ్స్‌లో చరిత్ర సృష్టించిన రోహిత్ శర్మ

- ఐసీసీ వన్డే బ్యాటర్ ర్యాంకింగ్స్‌లో తొలిసారి నంబర్ వన్
- సెంచరీతో రికార్డ్ బాటలో హిట్‌మ్యాన్

బలగం టీవీ, హైదరాబాద్

భారత సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో మరో మైలురాయి చేరుకున్నాడు. తాజా ఐసీసీ వన్డే బ్యాటర్ ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానాన్ని దక్కించుకుని చరిత్ర సృష్టించాడు. ఇటీవలి ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్ మూడో మ్యాచ్‌లో అద్భుతమైన సెంచరీతో మెరిసిన రోహిత్, ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు ఎగబాకి అగ్రస్థానంలోకి చేరాడు. ఆ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీతో కలిసి దుమ్మురేపిన రోహిత్ ప్రదర్శన




అభిమానులను ఆకట్టుకుంది.

రోహిత్ తన కెరీర్‌లో తొలిసారి 781 రేటింగ్ పాయింట్లతో నంబర్ వన్ బ్యాటర్‌గా నిలిచాడు. ఆఫ్ఘనిస్తాన్ ఆటగాడు ఇబ్రహీం జద్రాన్ (764 పాయింట్లు) రెండో స్థానానికి, శుభ్‌మన్ గిల్ మూడో స్థానానికి పడిపోయారు. ఇక విరాట్ కోహ్లీ 725 పాయింట్లతో ఆరవ స్థానంలో ఉన్నాడు.

వన్డే ఆల్‌రౌండర్ల విభాగంలో కూడా భారత ఆటగాడు అక్షర్ పటేల్ ర్యాంకింగ్స్‌లో పురోగతి సాధించాడు. ఇటీవల జరిగిన ఆసీస్ సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు గెలుచుకున్న రోహిత్, సిరీస్‌లో మొత్తం 202 పరుగులు (సగటు 101) సాధించాడు.వన్డే ఫార్మాట్ భవిష్యత్తుపై అనుమానాలు వ్యక్తమవుతున్న ఈ సమయంలో, రోహిత్ అగ్రస్థానంలో నిలవడం భారత క్రికెట్‌కు శుభసూచకం. వన్డే కెప్టెన్సీని శుభ్‌మన్ గిల్‌కు అప్పగించిన నేపథ్యంలో, రోహిత్ వన్డేలకు వీడ్కోలు పలుకుతాడని వచ్చిన వార్తలను అతని తాజా ప్రదర్శన కొట్టిపారేసినట్టయింది.

# ఘట్టమనేని కుటుంబం నుంచి నటి ఎంట్రీ..!

- సూపర్‌స్టార్ కృష్ణ మనవరాలు, మహేశ్ బాబు మేనకోడలు జాన్వి స్వరూప్ హీరోయిన్‌గా..!

బలగం టీవీ, హైదరాబాద్

తెలుగు సినీ పరిశ్రమలో ఘట్టమనేని కుటుంబానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. నటశేఖర కృష్ణ వారసత్వాన్ని అందిపుచ్చుకుని మహేశ్ బాబు సూపర్‌స్టార్‌గా ఎదిగిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే కుటుంబం నుంచి మూడో తరం వారసురాలు వెండితెరపై అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు.సూపర్‌స్టార్ కృష్ణ మనవరాలు, ఆయన కుమార్తె మంజుల ఘట్టమనేని – నటుడు సంజయ్ స్వరూప్ దంపతుల కుమార్తె జాన్వి స్వరూప్ ఘట్టమనేని, త్వరలోనే హీరోయిన్‌గా ప్రేక్షకులను పలకరించనున్నారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా ఈ సంతోషకరమైన వార్త వెలుగులోకి వచ్చింది.

మహేశ్ బాబు మేనకోడలు జాన్వి తొలి సినిమా వివరాలు ఇంకా ప్రకటించనప్పటికీ, టాలీవుడ్ వర్గాల్లో ఈ వార్త హాట్ టాపిక్‌గా మారింది. సోషల్ మీడియాలో అభిమానులు ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టులు షేర్ చేస్తున్నారు. ఘట్టమనేని కుటుంబం నుంచి మరో నటి రానున్నందుకు సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన జాన్వి ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పసుపు రంగు టాప్, ఆకుపచ్చ ప్యాంట్‌లో ఆమె లుక్ ఫ్రెష్‌గా, గ్లామరస్‌గా




ఉందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.

నిజానికి జాన్వికి నటన కొత్తేమీ కాదు. 2018లో తల్లి మంజుల దర్శకత్వం వహించిన ‘మనసుకు నచ్చింది’ చిత్రంలో ఓ చిన్న పాత్రలో కనిపించింది. అయితే, ఈసారి ఆమె పూర్తిస్థాయి హీరోయిన్‌గా తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. తాత కృష్ణ, మామయ్య మహేశ్ బాబు ల బాటలో జాన్వి కూడా నటిగా రాణించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఆమె తొలి సినిమా కథ, దర్శకుడు, హీరో వంటి వివరాలపై టాలీవుడ్ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వెలువడనుంది.

# శ్రీలంకలో ‘పెద్ది’ షూటింగ్

- రామ్ చరణ్, జాన్వీ జంటపై ఏఆర్.రెహమాన్ మ్యూజికల్ ట్రీట్

బలగం టీవీ, హైదరాబాద్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్యాన్–ఇండియా ప్రాజెక్ట్ ‘పెద్ధి’పై ప్రేక్షకుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. లి‘ఉప్పెన’లితో సంచలనం సృష్టించిన దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రం ఇప్పటికే ఫిల్మ్‌నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తాజా సమాచారం ప్రకారం, సినిమా యూనిట్ ప్రస్తుతం శ్రీలంకలో కీలకమైన షెడ్యూల్‌లో బిజీగా ఉంది. అక్కడ రామ్ చరణ్ – జాన్వీ కపూర్ జంటపై ఓ అద్భుతమైన పాటను చిత్రీకరిస్తున్నారు. ఈ పాటకు ఆస్కార్ విన్నర్ ఏఆర్.రెహమాన్ సంగీతం అందిస్తున్నందున, ఇది విజువల్‌గా, మ్యూజికల్‌గా ఒక గ్రాండ్ ట్రీట్‌గా మారబోతోందని సినీ వర్గాల టాక్.

ఇటీవల రామ్ చరణ్ శ్రీలంక బయలుదేరుతుండగా ఎయిర్‌పోర్ట్‌లో కనిపించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అదే తరహాలో, శ్రీలంక లొకేషన్ల నుండి వచ్చిన ఫోటోలు ఇప్పుడు అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు కలిసి దిగిన ఫోటోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆ ఫోటోల్లో వీరిద్దరూ ఒక పాత రైల్వే ట్రాక్ టన్నెల్ ముందు నిలబడి ఉన్నారు. ఈ లొకేషన్ చూశాక అభిమానుల్లో ఆసక్తికరమైన చర్చ మొదలైంది ఇది కేవలం సాంగ్ షూట్‌కేనా? లేక సినిమాలో కీలకమైన యాక్షన్ లేదా ఎమోషనల్ సీక్వెన్స్‌కా? అని ఫ్యాన్స్ ముచ్చటిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంతో కూడిన స్పోర్ట్స్ డ్రామాగా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో రామ్ చరణ్ మల్టిపుల్ లుక్స్‌లో కనిపించనున్నారని టాక్. సినిమా 2026 మార్చి విడుదల లక్ష్యంగా వేగంగా షూటింగ్ పూర్తిచేస్తోంది.

# “రవితేజ సార్ దేవుడిలా వచ్చారు”

- భీమ్స్ ఎమోషనల్ స్పీచ్

బలగం టీవీ, హైదరాబాద్



మాస్ మహారాజా రవితేజ హీరోగా నటిస్తున్న 75వ చిత్రం ‘మాస్ జాతర’ ప్రీ రిలీజ్ ఈవెంట్ శోభాయమానంగా జరిగింది. ఈ వేడుకలో చిత్ర సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో తన జీవితంలో ఎదుర్కొన్న కఠిన సమయాలను గుర్తుచేసుకుంటూ వేదికపై తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. రవితేజ తన జీవితంలో “దేవుడిలా వచ్చి కాపాడారని” చెప్పడంతో అభిమానులు కూడా కంటతడి పెట్టారు.

భీమ్స్ మాట్లాడుతూ “ఒకప్పుడు నేను పూర్తిగా వెనకబడిపోయాను. ఇంటి అద్దె ఎలా కట్టాలి, పిల్లల్ని ఎలా చదివించాలి, రేపు ఎలా బతకాలి అనే ఆలోచనలతో చివరి దశకు చేరాను. అంతా ముగించుకుందామనుకున్న ఆ సమయంలో పీపుల్స్ మీడియా ఫోన్ చేసింది, ఆ కాల్ రావడానికి కారణం రవితేజ సార్. ఆయన లేకపోతే ఈరోజు నేను, నా కుటుంబం ఉండేవాళ్లం కాదు,” అని అన్నారు. “ఆ సమయంలో రవితేజ సార్ నా పాలిట దేవుడిలా వచ్చారు. ఆయన ఇచ్చిన ఒక్క అవకాశం నన్ను తిరిగి బతికించింది. నా ప్రేమను మాటల్లో కాదు, నా సంగీతంలో చూపిస్తాను. సార్ నాకు దేవుడు,” అంటూ భావోద్వేగంగా మాట్లాడారు. ఈ సమయంలో వేదికపై వాతావరణం మరింత ఎమోషనల్‌గా మారింది. అభిమానులు భీమ్స్‌కు హర్షధ్వానాలతో అండగా నిలిచారు. దీనిపై రవితేజ తనదైన శైలిలో స్పందిస్తూ “భీమ్స్ ఇంత ఎమోషన్ ఎందుకయ్యా నువ్వు! నీ ఎమోషన్ తగలెయ్య. స్క్రీన్‌పై ఇరగదీయబోతున్నాడు మా వాడు. సౌండ్‌తో సినిమా చూశాను, అద్భుతంగా ఉంది,” అని నవ్వుతూ చెప్పారు. యంగ్ రైటర్ భాను బొగవరపు ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. భారీ అంచనాల నడుమ ‘మాస్ జాతర’ అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **వరి కోతలు మొదలు పెట్టని రైతులు మూడు రోజులు వాయిదా వేసుకోవాలి**
- **కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా చూసుకోవాలి**
- **ప్రాజెక్టులు, పరిసర ప్రాంతాల్లో అధికారులు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలి**
- **ప్రాణ, ఆస్తి, పశువుల నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి**
- **ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తుఫాన్ నేపథ్యంల జిల్లాలో 2 రోజుల పాటు భారీ నుంచి కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ కోరారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జిల్లాలోని రెవెన్యూ, వ్యవసాయ శాఖ, ఈఈ పీఆర్, ఆర్ అండ్ బీ, నీటి పారుదల శాఖ, పౌర సరఫరాల శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్, ఎంపీడీవోలు, ఇతర శాఖల అధికారులతో బుధవారం సాయంత్రం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఎగువ మానేరు, మధ్య మానేరు, మూల వాగు మానేరు వాగు తదితర పరిసర ప్రాంతాల్లోకి రైతులు, ప్రజలు వెళ్లకుండా నీటిపారుదల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు నీటిమట్టాన్ని అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు తమ పరిధిలోని కాజ్వేలు, కల్వర్టల వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటే తమ సిబ్బందితో వెంటనే బారికేడ్లు ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. బ్రిడ్జిలు, రహదారులు ఏమైనా దెబ్బతింటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, కావాల్సిన మరమ్మతులు చేయాలని సూచించారు.

రైతులు కొనుగోలు కేంద్రాల్లో పోసిన దాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల బాధ్యులు ఆయా శాఖల అధికారులు తార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, రైతులకు ఇబ్బందులు కలవకుండా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇంకా వరి కోతలు మొదలు పెట్టిన రైతులు మరో మూడు రోజులు వాయిదా వేసుకోవాలని కోరారు. ప్రాణ, ఆస్తి, పశువుల నష్టం వాటిల్లకుండా చూడాలని, ఏమైనా నష్టం జరిగితే జిల్లా అధికారులు దృష్టికీ తీసుకురావాలని సూచించారు వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు పొంచి ఉంటాయని ఎంపీడీవోలు, ఎంపీలు పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పారిశుద్ధ్య సమస్య రాకుండా ఏర్పాట్లు చేయాలని, నీరు నిలవకుండా నిల్వ ఉండకుండా చూడాలని, ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు.

జిల్లావ్యాప్తంగా మత్స్యకారులు ఎవరూ చేపలు పట్టడానికి వెళ్ళవద్దని సూచించారు. కల్వర్టులు దాటువద్దని, నీటి వనరుల సమీపంలో ప్రయాణాలు చేయవద్దని, అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అత్యవసమైతే తప్ప ప్రజలు ఇండ్ల నుండి బయటకు రావద్దని ఇంచార్జి కలెక్టర్ పేర్కొన్నారు.

**కంట్రోల్ రూం అందుబాటులో..**

ఐడీఓసీ లో కంట్రోల్ రూం అందుబాటులో ఉంటుంది. వర్షం, వరద ప్రభావిత ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 93986 84240 ఉందని. వర్షం, వరద ప్రభావిత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## వర్షాల నేపథ్యంలో విద్యా సంస్థలు, అంగన్వాడీలకు నేడు సెలవు

- **రాజన్న సిరిసిల్ల ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, హైదరాబాద్:**

తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు, అంగన్వాడీ కేంద్రాలకు గురువారం సెలవు ప్రకటిస్తున్నట్లు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని కోరారు.

# బిసి రిజర్వేషన్ అమలుకై దీక్ష పోస్టర్ ఆవిష్కరణ



**ఉస్మానియా వేదికగా దీక్ష ప్రారంభిస్తాం**

**బిసి విద్యార్థి ఓయూ జేఏసీ పిలుపు**

**బలగం టీవీ, తంగళ్లపల్లి**

బీసీ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా జరిగే దీక్ష పోస్టర్ ను రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ .వాకాటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ గౌడ్,అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బీర్ల ఐలయ్య కలిసి ఆవిష్కరించారు.ఉస్మానియా యూనివర్సిటీ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో 42% రిజర్వేషన్ సాధించడం కోసం నవంబర్ 4 నుంచి 8 వరకు విద్యార్థి రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తమని తెలిపారు.

బిసి లకు 42% రిజర్వేషన్ సాధనలో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీ బిసి విద్యార్థి జేఏసీ డాక్టర్. జంపాల రాజేష్ మరియు, బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ కే.సైదులు యాదవ్ బీసీ విద్యార్థి జాక్ వైస్ చైర్మన్ వెంకట్ తిమ్మనగరం నాయకత్వంలో బీసీ విద్యార్థి రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తామన్నారు.నవంబర్ 4 తారీకు దీక్షను ప్రారంభించడానికి ఎమ్మెల్యేలను, ఎంపీలను ఆహ్వానిస్తున్నామని నవంబర్ 8 రోజు రాష్ట్రంలోని బిసి ఉద్యమకారులందరినీ ఆర్ట్స్ కాలేజ్ వేదికకు ఆహ్వానించబోతున్నామన్నారు.

42 శాతం రిజర్వేషన్ విషయంలో బిజెపి పార్టీ మొండి వైఖరి వదులుకోవాలని 42 శాతం రిజర్వేషన్ బిసి లా హక్కు అని మరియు దేశంలోనే అత్యధిక జనాభా ఉన్నటువంటి బిసి లకు రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో బిజెపి పార్టీ యొక్క ఆలోచన విధానము మానుకోవాలి లేకుంటే బిజెపి పార్టీకి భవిష్యత్తులో వచ్చే ఎన్నికలలో బుద్ధి చెప్తామన్నారు. మరియు భవిష్యత్తు కార్యాచరణలో భాగంగా ఈ ఉద్యమాన్ని గ్రామాల్లోకి తీసుకెళ్తామని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు .నవంబర్ 8 తేదీ లోపు బిసి లకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చి భారత రాజ్యాంగంలోనీ 9 వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఓయూ విద్యార్థులు, బిసి విద్యార్థి జేఏసీ ఉస్మానియా యూనివర్సిటి విద్యార్థులు పాల్గొన్నారు.



## వేములవాడ రాజన్న ఆలయంలో సామూహిక కార్తీక దీపోత్సవ ప్రారంభం..

**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు అక్టోబర్ 22 నుండి నుండి నవంబర్ 22 వరకు సామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం ఎనిమిదవ రోజు భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా ప్రారంభించారు. భీమేశ్వర స్వామి ఆలయ దేవాలయంలో సేవా సమితి సభ్యులు భక్తి గీతాలు, భజనలతో భక్తులను అలరించారు.

కార్తీక మాస పర్వదినాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ సామూహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమం ప్రతి రోజూ సాయంత్రం 6:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు సుహాసినీల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించబడుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుహాసినీలకు ఆలయ అర్చకులు మరియు ఆలయ ఉద్యోగులు చేతుల మీదుగా వాయనం పసుపు కుంకుమ అక్షింతలు గాజులు స్వామివారి ఫోటోను అందజేశారు.

## డిప్యూటీ సీఎంను కలిసిన ప్రభుత్వ విప్..

**బలగం టీవీ, వేములవాడ:**



తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు.ఇటీవల కలికోట సూరమ్మ రిజర్వాయర్ కుడి ఎడమ కాలువ నిర్మాణ భూ సేకరణ 35 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేయడం పట్ల ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలపగ బుధవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.. వేములవాడ రాజన్న ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి విస్తరణ పనులు ప్రభుత్వ విప్, డిప్యూటీ సీఎం విక్రమార్కకు వివరించారు.



## మిత్రుని కుటుంబానికి అండగా నిలిచిన పదో తరగతి మిత్రులు..

**బలగం టీవీ, సిరిసిల్ల:**

తమతో పాటు చదువుకున్న మిత్రుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మరణించడంతో వారి కుటుంబానికి పదవ తరగతి మిత్రులు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు.రాజన్న సిరిసిల్ల జిల్లా, చందుర్తి మండలం, జోగాపూర్ గ్రామానికి చెందిన మట్టెల తిరుపతి ఇటీవల బావిలో పడి మరణించడం వారి కుటుంబం ఆర్థికంగా అత్యంత దీన స్థితికి చేరుకుంది. తల్లి బీడీ కార్మికురాలు కాగా, తండ్రి వృద్ధాప్యం, అనారోగ్యంతో బాధపడుతున్నారు. భర్త అనారోగ్యంతో,కొడుకును కోల్పోయి, ఆ ఇల్లాలి బాధ వర్ణనాతీతంగా ఉంది. ఈ విషయం తెలుసుకున్న 2005-2006 పదవ తరగతి బ్యాచ్ స్నేహితులు మరియు స్నేహితురాళ్ళు మానవత్వాన్ని చాటుకున్నారు. తమ తోటి స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకోవాలని నిర్ణయించుకొని మృతుడి తల్లిదండ్రులయిన మట్టెల భాగ్యవ్వ %-% దేవయ్యలకు రూ.15,000 రూపాయల నగదు, మరియు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేసి అండగా నిలిచారు.

## 'భారత్ రైస్ కాన్ఫరెన్స్'కు తెలంగాణ పౌర సరఫరాల శాఖ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఆల్ ఇండియా రైస్ ఎగుమతిదారుల సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం "భారత్ ఇంటర్నేషనల్ రైస్ కాన్ఫరెన్స్ (బీఐఆర్సీ)" ను అక్టోబర్ 30, 31 తేదీలలో న్యూఢిల్లీలో నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ పౌర సరఫరాల శాఖ ఈ సదస్సులో పాల్గొనాలని నిర్ణయించింది. రాష్ట్ర బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్లో ఎగుమతి అవకాశాలను విస్తరించేందుకు ఈ కాన్ఫరెన్స్‌ను సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా తెలం గాణ పౌర సరఫరాల శాఖ కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ఆ శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.